

శ్రీవారి సేవలో ఎన్నికల పరిశీలకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు పర్దీప్ కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ ధింగార సందర్శించారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముదినేపల్లికి చెందిన భక్తుడు కె.రామకృష్ణ ప్రసాద్ రూ.1,00,000లను విరాళంగా అందజేశారు.



హమారా జగన్

ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీజేపీ నిర్ణయంతో కూటమికి ఎదురుగాలి వీస్తోంది. తామంతా సీఎం జగన్‌కు అండగా ఉంటామని ముస్లిం నేతలు అంటున్నారు. 8లో ▸

ఏలూరు దేశం.. రౌడీరాజ్యం

దందాలు.. దౌర్జన్యాలు

- క్రికెట్ బెట్టింగులు, పేకాటలే వృత్తి
- కేసుల నుంచి తప్పించుకోవడానికి టీడీపీ నేత అండ
- భూదందాల్లో టీడీపీ అభ్యర్థి చంటి అనుచరగణం
- రౌడీషీటర్ల కనుసన్నల్లోనే ఎన్నికల ప్రచారం
- వలంటీర్లు, ఓటర్లపై బెదిరింపులకు దిగుతున్న వైనం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు టీడీపీలో నేరచరిత్రలదే రాజ్యం.. అసాంఘిక కార్యకలాపాల్లో అందెవేసిన చేయి ఉన్న నేతలకు అగ్ర ప్రాధాన్యం.. ఏలూరు టీడీపీ అభ్యర్థి బడేటి చంటి చుట్టూ ఉన్న ప్రధాన కోటరీల్లో సింహభాగం రౌడీషీటర్లు, క్రికెట్ బుకీలు, పేకాట నిర్వాహకులే ఉన్నారు. నగరంలో అనేక స్థలాల కబ్జా, దందా, హత్యకేసులు, ఇతర వివాదాస్పద వ్యవహారాల్లో వీరి పాత్ర కీలకం. ఎన్నికల ప్రచారంలోనూ వీరు హవా చూపిస్తున్నారు. డివిజన్ల వారీగా నేరచరిత్ర ఉన్న కోటరీ ముఠాకు బాధ్యతలు అప్పగించి వలంటీర్లు, ఓటర్లను పరోక్షంగా టార్గెట్ చేస్తూ బెదిరింపు రాజకీయాలకు ఏలూరు టీడీపీ తెగపడింది.

బెదిరింపుల పర్వం : క్రికెట్ బుకీలు కొన్ని డివిజన్లు.. రౌడీషీటర్లు మరికొన్ని డివిజన్లు.. పేకాట, పొలిటికల్ బుకీలు ఇంకొన్ని డివిజన్లు పంచుకుని ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంతో పాటు మాట వినని వారిని ప్రభుత్వం వచ్చాక చూసుకుందాం అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. రౌడీషీటర్ కమ్ క్రికెట్ బుకీగా ఉన్న ఒక నేత రెండు, మూడు డివిజన్లల్లో వలంటీర్లపై అర్ధరాత్రి వేళ బెదిరింపుల పర్వానికి దిగడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం చంటి క్యాంపులో ఉన్న నలుగురు రౌడీషీటర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రచారం తమదైన శైలిలో నిర్వహిస్తున్నారు. వీరిలో ఒక రౌడీషీటర్‌పై రెండు హత్య కేసులున్నాయి. గతంలో చిన్నపాటి వ్యాపారాలు నిర్వహించి ప్రస్తుతం ఫుల్‌టైం రాజకీయ నాయకుడిగా చంటితోనే తిరుగుతూ హవా చూపిస్తున్నాడు. మరో ఇద్దరు రౌడీషీటర్లు నగరంలో పేరొందిన లాయర్ హత్య కేసులో నిందితులుగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో వీరూ క్రియాశీలకంగా ఉన్నారు. మరో రౌడీషీటర్‌పై హత్య, కిడ్నాప్, స్థల వివాదాల కేసులు ఉన్నాయి.

దౌర్జన్యాలు.. భూ కబ్జాలు

ప్రస్తుతం డీమార్ట్ సమీపంలోని ఒక అపార్ట్‌మెంట్, తంగెళ్లమూడిలో సుమారు వెయ్యి గజాలు, మరోచోట 178 గజాల స్థలాలకు సంబంధించి వివాదాల్లో జోక్యం చేసుకుని తన పరం చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే విద్యానగర్‌లో సుమారు 2 వేల గజాల స్థలానికి సంబంధించిన వ్యవహారంలో జోక్యం చేసుకుని ఒక పక్షాన నిలిచి స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఏలూరు నగరం, దెందులూరు, కైకలూరులో పేకాట నిర్వహణలో ప్రముఖులుగా పేరున్న వ్యక్తులు కూడా ఇదే బ్యాచ్‌లో కొనసాగుతున్నారు. ముగ్గురు క్రికెట్ బుకీలు కూడా ఎన్నికల్లో క్రియాశీలకంగా ఉంటూ లిక్కర్ పంపిణీ వ్యవహారంలో బిజీగా ఉన్నారు. ప్రతి ఐపీఎల్ సీజన్‌లోనూ భారీగా సంపాదించుకుంటున్నారు.

పేకాట నిర్వహణలో చంటి పాత్ర

బడేటి చంటికి రియల్ ఎస్టేట్, సెటిల్‌మెంట్లతో పాటు పేకాట అంటే బాగా పిచ్చి. కేవలం పేకాట ఆడటం కోసం వైజాగ్, బెంగళూరు వెళ్తుంటారని ఏలూరులో బలమైన టాక్ ఉంది. 2022లో విశాఖ జిల్లా భీమిలిపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతూ 22 మంది దొరికారు. వీరిలో మొదటి నిందితుడిగా బడేటి చంటి ఉండటంతో ఆయనపై ఎఫ్ఐఆర్ నం.66/2022తో కేసు నమోదైంది. బుజ్జి సోదరుడు చంటి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కైకలూరులో టీడీపీ నేత గెస్ట్‌హౌస్‌లో చంటి నేతృత్వంలో పెద్ద ఎత్తున పేకాట శిబిరం నిర్వహించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. పేకాటలో పాల్గొనే కొందరితో నిర్వాహకులకు సమస్యలు తలెత్తడంతో పోలీసులకు సమాచారమిచ్చి పట్టించారు. అలాగే ఏలూరులోనూ రెండు, మూడు ప్రాంతాల్లో రౌడీబాయ్స్ కనుసన్నల్లో పేకాట సాగుతుంటుంది.

టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

ఇరువర్గాల కొట్లాట.. కేసు నమోదు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. జీలుగుమిల్లి మండలంలో జరిగిన ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ ప్రచారంలో బొరగం శ్రీనివాస్, మొడియం శ్రీనివాస్ వర్గీయుల మధ్య ఒక్కసారిగా విభేదాలు చెలరేగాయి. రెండు వర్గాల్లో మాటామాటా పెరిగి శ్రేణులు తీవ్రంగా కొట్టుకున్నారు. కొట్లాటలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. కొద్దిరోజుల క్రితం కూటమి అభ్యర్థులు జంగారెడ్డిగూడెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కూడా ఈ రెండు వర్గాల వారే తీవ్రంగా కొట్టుకున్నారు. పార్టీ అధినాయకులు ఆ సమయంలో వారికి సర్దిచెప్పారు. అయితే రెండు వర్గాల మధ్య చాప కింద నీరుగా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం పాలచర్లలో జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలవరం అసెంబ్లీ టికెట్ కోసం ఇటు బొరగం శ్రీనివాసులు, అటు మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. బొరగం శ్రీనివాసులుకు టికెట్ ఇస్తామని మొండిచేయి చూపించారు. అలాగే చంద్రబాబు తనయుడు లోకేష్ మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే వీరిద్దరికీ కాకుండా కూటమి ఉమ్మడి అభ్యర్థిగా జనసేనకు చెందిన చిర్రి బాలరాజుకు టికెట్ రావడంతో ఇక్కడ విభేదాలు తీవ్రస్థాయికి చేరుకుని రెండు వర్గాల మధ్య కొట్లాటలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారంలో ఘర్షణలు జరుగుతున్నాయి.

ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు (మెట్రో): జిల్లావ్యాప్తంగా ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు విస్తరణ, ప్రణాళిక అమలు, తదితరల అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పీలతో గురువారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఆర్వో డి.పుష్పమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద హెల్త్ క్యాంపు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, 108 వాహనం, తదితర ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. వెయ్యికి మించి ఓట్లున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లడ్ లైట్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆయా పాఠశాలల్లో ఉన్న పీఏ సిస్టమ్‌లను వినియోగించుకోవాలన్నారు. 100 మీటర్ల పరిధిలో బారికేడింగ్‌ల ఏర్పాటుతోపాటు ఓటర్ల జాబితా మార్కిడి కాపీలను రేపటికల్లా పూర్తి చేస్తున్నామన్నారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ దాదాపు 99 శాతం పూర్తయిందన్నారు. 1,083 పోలింగ్ ప్రాంతాల్లో దివ్యాంగులు ఓటు వేసేందుకు 1100 వీల్‌ఛైర్ లను, రెడ్ క్రాస్ కార్యకర్తలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్ర తల నిర్వహణకు పటిష్ట రక్షణ చర్యలు తీసుకున్న ట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.

రేపు సాయంత్రం నుంచి 144 సెక్షన్

ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించడం కోసం 144 సెక్షన్ కింద అధికారాలను అమలు చేస్తూ శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు నిషేధం అమల్లో ఉంటుందని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధమన్నారు. ప్రజలు గుంపులుగా, ఐదుగురు కంటే ఎక్కువగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆయుధాలు, తుపాకీలు, పదునైన వెపన్లు వంటివి కలిగి ఉండరాదన్నారు.

‘ఓటు హక్కు వినియోగం’పై ముగ్గుల పోటీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు(మెట్రో): ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగం అనే అంశంపై మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు స్వీప్ నోడల్ అధికారి–జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. గురువారం జిల్లా అధికారుల బృందం ఏలూరు సెయింట్ థెరిసా మహిళా డిగ్రీ కళాశాలలో స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచాలనే లక్ష్యంతో ఓటర్లలో చైతన్యం పెంచే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గలవారు సెల్ 9849903321 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



గొమ్ముగూడెం పంచాయతీలో పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు

కుక్కునూరు: టీడీపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు అన్నారు. గురువారం గొమ్ముగూడెం పంచాయతీలో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారిని మండల అధ్యక్షుడు నరసింహరాజు, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, రావు వినోద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టో చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అమలు సాధ్యం కానీ హామీల మేనిఫెస్టో చూసిన ప్రజలు చంద్రబాబు అబద్ధపు హామీలు ఇస్తున్నారని అర్థం చేసుకొని పార్టీలు మారుతున్నారని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉంటే స్థానిక టీడీపీ నాయకులు పార్టీలో చేరని వారిని చేరినట్టు ప్రచారం చేసుకుంటూ శునకానందం పొందుతున్నారని విమర్శించారు. ఎన్నికల తర్వాత జనసేన, టీడీపీలు కనుమరుగవ్వడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో.. గుమ్మల ప్రభాకర్ రావు, మున్నిగల బాబురావు, మాటూరి భాను ప్రసాద్, గుమ్మల చంటి, ధనరాజ్, మురళి, కనుపల్లి వెంకటేష్, గుమ్మల సంతోష్, బొర్ర సాంబయ్య, బొర్ర శేఖర్, బట్ట వెంకటేశ్వర్లు, కనుపల్లి సతీష్, గుమ్మల సత్యనారాయణ, గుమ్మల అచ్చయ్య, సాంబయ్య ఉన్నారు. కార్యక్రమంలో గొమ్ముగూడెం, ఉప్పేర, మద్దిగట్ల గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం.. అభివృద్ధి ఘనం

- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం సురక్షిత తాగునీటికి పనులు
- సంక్షేమం రూపంలో రూ.303.82 కోట్ల లబ్ధి

అర్బన్ పీహెచ్‌సీ భవనం



పథకాల లబ్ధి	డీబీటీ రూపంలో.. 60,419 మందికి రూ.192.65 కోట్లు	నాన్ డీబీటీ రూపంలో.. 24,763 మందికి రూ.111.17 కోట్లు

జంగారెడ్డిగూడెం: అభివృద్ధి అంటే మాటల్లో కాదు చేతల్లో చూపించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రజారంజక పాలన సాగించారు. ఒక పక్క అర్హులందరికీ సంక్షేమాన్ని అందిస్తూనే, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా మౌలిక వసతులు కల్పించారు. పట్టణ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలోభాగంగా జంగారెడ్డిగూడెం పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

సుమారు 70 వేల జనాభా

జంగారెడ్డిగూడెంలో సుమారు 70 వేల జనాభా ఉంది. వీరిలో ఎక్కువ మంది అల్పాదాయవర్గాల వారే. పట్టణానికి ఆనుకుని ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్న జంగారెడ్డిగూడేనికి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్నారు. దీంతో పట్టణంలో ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబాలు కనిపిస్తున్నాయి. సీఎం జగన్ పట్టణంలో 60,419 మందికి సంక్షేమం రూపంలో నేరుగా (డీబీటీ రూపంలో) రూ.192.65 కోట్లు, నాన్ డీబీటీ రూపంలో 24,763 మందికి రూ.111.17 కోట్ల నగదు అందజేశారు. మొత్తంగా రూ.303.82 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో అందించారు.

వసతుల కల్పనకు.. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇప్పటికే రూ.14 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఇటీవల రూ.3.66 కోట్లతో మరిన్ని కార్యక్రమాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంభం విజయరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. వీటిలో 14 వార్డులకు మంచినీరు అందించేలా రూ.1.40 కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మరో రూ.23 కోట్లతో.. పట్టణంలో సుమారు రూ.23 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్, వివిధ రకాల భవనాలు, యూపీహెచ్‌సీ, కమ్యూనిటీ హాళ్లు, పైపులైన్ల నిర్మాణం వంటివి చేపట్టారు. పట్టణంలో ఇప్పటివరకు రూ.16 కోట్లతో సీసీరోడ్లు, బీటీ రోడ్లు నిర్మించగా, బీటీ రోడ్లు 8 పనులగాను రూ.3 కోట్లు, సీసీ రోడ్లు 220 పనులకుగాను రూ.13 కోట్లు ఖర్చు చేశారు. అలాగే పట్టణంలోని ఊరచెరువు ప్రాంతంలో ఇళ్లు ముంపునకు గురికాకుండా ఉండేలా వెడలైన భారీ సీసీ డ్రెయిన్ నిర్మాణంతో పాటు పలు వార్డుల్లో నిర్మించిన సీసీ డ్రెయిన్‌లు సుమారు 25 డ్రెయిన్‌లకు రూ.3 కోట్లు వెచ్చించారు. అలాగే యూపీహెచ్‌సీ, కమ్యూనిటీ హాళ్లు, వివిధ రకాల భవనాల నిర్మాణం కోసం రూ.3 కోట్లు, మంచినీటి ఎద్దడి లేకుండా పైపులైన్‌ల ఏర్పాటుకు సుమారు రూ.28 లక్షలు ఖర్చుచేశారు.



సాలిపేటలో సీసీ రోడ్డు



జంగారెడ్డిగూడెం-బుట్టాయగూడెం రోడ్డు



డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవనం

న్యూస్‌రీల్

ట్రైనీ ఐపీఎస్‌లకు సూచనలు



ట్రైనీ ఐపీఎస్‌లతో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 9 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు గురువారం ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వుల మేరకు వీరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో నేర్చుకొనే పలు అంశాలు భవిష్యత్ ఉద్యోగ నిర్వహణలో తోడ్పడగలవన్నారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అంశాలు, నివేదిక సమర్పణ, మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలు, ఎన్నికల్లో ప్రలోభాలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల పనితీరు, ప్రచారానికి అనుమతులు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై వివరించారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఈనెల 12, 13వ తేదీల్లో పోలింగ్ రోజు, పోలింగ్ ముందురోజు పత్రికల్లో వేసే ప్రకటనలకు పోటీ చేసే అభ్యర్థులు రెండురోజులు ముందుగా ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. పత్రికల యాజమాన్యాలు కూడా సదరు ఎంసీఎంసీ ధ్రువీకరణ ముందస్తు అనుమతి లేకుండా తమ పత్రికల్లో రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రకటనలు ప్రచురించరాదని కోరారు. పోటీచేసే అభ్యర్థి, పార్టీ తరపున వేరొక సంస్థ లేదా వేరే వ్యక్తి ఇచ్చే వాటికి కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు.

1.87 లక్షల టన్నుల ధాన్యం సేకరణ



లావణ్యవేణి, జేసీ

ఏలూరు (మెట్రో): జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 2.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 1,87,371.080 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. గురువారం ఆమె వివరాలు వెల్లడించారు. రైతులకు ధాన్యం సొమ్ములు రూ.391.47 కోట్లకు గాను రూ.226.22 కోట్లు వ్యక్తిగత ఖాతాలకు జమ చేశామన్నారు. ముదినేపల్లి, పోలవరం మండలాలకుగాను ఖరీఫ్ సీజన్‌లో మిగిలిన 4,219 టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేశామన్నారు. ఎక్కడైన టెక్నికల్, గోనె సంచులు, వాహనాల గురించి ఇబ్బందులుంటే త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు.

14న సెలవుకు వినతి

ఏలూరు(మెట్రో): ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఈనెల 14న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయాలని పీఎస్‌జీవోస్ అసోసియేషన్, జేఏసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ కోరారు. పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు ఈనెల 12న ఉదయం వారికి కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గ పంపిణీ కేంద్రాలకు వెళ్లి బీయూ, సీయూ, వీవీప్యాట్‌లు, ఎన్నికల సామగ్రిని తీసుకుని సాయంత్రానికి పోలింగ్ స్టేషన్‌కు చేరుకోవాలన్నారు. 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ విధులు నిర్వర్తించి రాత్రికి ఎన్నికల సామగ్రిని జిల్లా కేంద్రాల్లో అప్పగించాల్సి ఉంటుందన్నారు. దీంతో వీరికి మరుసటి రోజు 14న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయాలని కోరారు.

జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతకు జ్యూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఆపైన విద్యార్హతలు కలిగిన వారికి 13 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. అలాగే సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్‌పై 10వ తరగతి ఆపైన విద్యార్హత కలిగిన యువతకు 30 రోజులు శిక్షణ అందిస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 16న ప్రారంభమవుతుందని, 19 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు ఉచితంగా అందిస్తామన్నారు. సెల్ 9948565256, 9502723561 నంబర్లలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణకు వచ్చే సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 3 కలర్ పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

కామవరపుకోట: స్థానిక ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.70 వేలు నగదు స్వాధీన పరుచుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ చెప్పారు. ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకువెళ్తున్నందున నగదు సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు తెలిపారు. వాహనాల తనిఖీలలో పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యరావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, వీడియో గ్రాఫర్లు వీరమల్ల మధు, సొజన్ సాయి పాల్గొన్నారు.

హమారా జగన్

- ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నిర్ణయంతో తీవ్ర వ్యతిరేకత
- ఏలూరు జిల్లాలో కూటమి అభ్యర్థులకు ఎదురుగాలి
- బీజేపీతో పొత్తుతో టీడీపీ, జనసేన నేతల్లోనూ ఆందోళన
- జగన్ ప్రభుత్వంలో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో లబ్ధి
- రాజకీయ పదవుల్లోనూ ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యత



చింతలపూడి: కేంద్రంలోని ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారంలోకి వస్తే దేశంలో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ముస్లిం మైనార్టీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేంద్రంలోని బీజేపీతో రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడంతో ముస్లింలు ఆ పార్టీల వైఖరిని ఎండగడుతున్నారు. బీజేపీ నిర్ణయంతో ఏలూరు జిల్లాలో కూటమి అభ్యర్థులు ఎదురుగాలి వీస్తోంది. అంతేకాక జనసేన, టీడీపీ నాయకుల్లో కూడా బీజేపీతో పొత్తు వల్ల తమపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాదయాత్ర ద్వారా ముస్లిం మైనార్టీల స్థితిగతులను తెలుసుకున్న వైఎస్సార్ రాష్ట్రంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ముస్లిం మైనార్టీ వర్గాల ఎదుగుదలకు ఎంతో దోహదపడింది. బీజేపీతో అంటకాగుతున్న చంద్రబాబు ఏనాడూ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఒకసారి వాజ్‌పేయి, మరోసారి మోదీతో పొత్తుతో గెలిచాడని, చంద్రబాబు అధికారంలోకి ఉన్నంతకాలం ముస్లింలు వివక్షను ఎదుర్కొన్నారని ముస్లిం పెద్దలు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కేవలం అధికారం కోసమే బీజేపీతో జతకట్టారని, ప్రస్తుత బీజేపీ రిజర్వేషన్ల రద్దు నిర్ణయం నేపథ్యంలో బీజేపీని ఎలా ఎదుర్కొంటారని ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ముస్లింలు నిరాదరణకు గురికాగా, జగన్ ప్రభుత్వంలో ఒక ఉప ముఖ్యమంత్రి పదవి, నాలుగు ఎమ్మెల్యేలు, నాలుగు ఎమ్మెల్సీ పదవులు, పట్టణాల్లో, మండల పరిషత్‌లలో పదవుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేస్తున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాము ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేయడంతో ముస్లింల సంక్షేమంపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి వెల్లడవుతోంది. ముస్లింల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకమైన శ్రద్ధ చూపించడంతో ఇటీవల కాలంలో వైఎస్సార్ సీపీలో ముస్లింల చేరికలు గణనీయంగా పెరిగాయి. మతతత్వ బీజేపీతో జతకట్టిన టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలనే నిర్ణయానికి ముస్లిం సంఘాలు వచ్చాయని చెబుతున్నారు.

సైకిల్‌కి ఓటేస్తే బీజేపీకి వేసినట్లే



సైకిల్‌కి ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్లే. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం బీజేపీకి ఆది నుంచి ఇష్టం లేదు. ముస్లింల రిజర్వేషన్లకు వ్యతిరేకమని బీజేపీ బహిరంగంగానే ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో బీజేపీతో జతకట్టిన ఏపార్టీని నమ్మే పరిస్థితుల్లో ముస్లింలు లేరు. మహానేత వైఎస్సార్ ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల నా పిల్లలు ముగ్గురూ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. వైఎస్ జగన్ పాలనలోనే ముస్లింలకు రక్షణ ఉంది. వచ్చే ఎన్నికల్లో ముస్లింలు ఆలోచించి ఓటు వేయాలి.

– ఎండీ ఇబ్రహీం దౌలా (జిలాని),
మైనార్టీ ముస్లిం నాయకులు, చింతలపూడి

ముస్లింలకు రిజర్వేషన్లు ఉండాల్సిందే



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో అవకాశం కల్పించారు. ఆయన బిడ్డ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక మా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇటీవల విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లను కొనసాగిస్తానని ప్రకటించారు. ఎన్నికల సమయంలో బీజేపీ పెద్దలు ముస్లిం రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేయడం దేశానికి ప్రమాదకరం. ముస్లింలపై జగన్‌కు ఉన్న అభిమానానికి కృతజ్ఞతలు.

– ఎండీ అక్బర్ అలీ,
ముస్లిం మైనార్టీ నాయకులు, చింతలపూడి

జగన్ వెంటే ముస్లింలు



ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన దేవుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఆయన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా నడుస్తున్నారు. ముస్లింలకు రిజర్వేషన్లను తొలగించాలని బీజేపీ నాయకులు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. బీజేపీతో జతకట్టిన పార్టీలను ముస్లింలు ఏమాత్రం విశ్వసించరు. వైఎస్ తనయుడిగా ముస్లింలకు అండగా ఉన్న జగన్ వెంటే ముస్లింలు అందరూ ఉంటారు.

– షేక్ మస్తాన్‌వలీ,
ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

మతతత్వ పార్టీలను దూరం పెట్టండి



మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. అలాగే ఆ పార్టీలతో జత కట్టే వారితోనూ దూరంగా ఉండాలి. టీడీపీ ముస్లింలను ఎప్పుడూ ఓటు బ్యాంకుగా మాత్రమే చూసింది తప్ప వారి సంక్షేమాన్ని ఎప్పుడూ పట్టించుకోలేదు. ముస్లింలకు రిజర్వేషన్లు తొలగిస్తామన్న బీజేపీ వైఖరిపై ముస్లింలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

– మహమ్మద్ జహీర్,
వైస్ ఎంపీపీ కైకలూరు.

కూటమికి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దు



కూటమిలో భాగంగా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ఓట్లు వేస్తే పరోక్షంగా ముస్లింలకు రిజర్వేషన్ల రద్దును ఒప్పుకున్నట్లుగానే భావించాలి. మహానేత వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కొనసాగించారు. దీంతో అనేక మంది ముస్లింలకు ఉపాధి అవకాశాలు లభించాయి. ముస్లింలకు రిజర్వేషన్ల కొనసాగింపునకు సీఎం జగన్ కృషి చేయడం అభినందనీయం.

– షేక్ చాన్‌బాషా,
జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు, కలిదిండి

టీడీపీ పాలనలో ఒక్క పదవీ లేదు



టీడీపీ పాలనలో ముస్లిం మైనార్టీ శాఖ కూడా ముస్లింలకు చంద్రబాబు కేటాయించలేదు. జగన్ పాలనలో ఉప ముఖ్యమంత్రి, మండలి డెప్యూటీ చైర్మన్, నాలుగు ఎమ్మెల్యేలు, నాలుగు ఎమ్మెల్సీ పదవులిచ్చారు. మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను కొనసాగిస్తామని చెప్పారు. ముస్లింలకు వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ ఫలాలు పూర్తి స్థాయిలో దక్కాయి.

– ఎండీ.హమీద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి, కైకలూరు

జగన్ ప్రభుత్వంలోనే ముస్లింలకు మేలు



ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించింది వైఎస్సార్ అయితే మైనార్టీలను ఆర్థికంగా ఆదుకుంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రిజర్వేషన్లు అమలు చేసి విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ముస్లింలకు మేలు జరిగింది. కూటమి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని చెబుతున్నారు. మైనార్టీలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే నడుస్తాం.

– మహ్మద్ అయూబ్ ఖాన్,
వసంతవాడ, పెదపాడు మండలం

వైఎస్సార్ సీపీని గుండెల్లో పెట్టుకుంటాం



ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తానన్న బీజేపీ ప్రకటించిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని వైఎస్ జగన్ చెప్పడం అభినందనీయం. చంద్రబాబు, బీజేపీ, పవన్‌కు మొదటి నుంచి ముస్లింలు అంటే ద్వేషమే. రిజర్వేషన్లు రద్దు చేసి మా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. వైఎస్సార్ సీపీని ముస్లింలు అంతా గుండెల్లో పెట్టుకుంటారు. ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుంది.

– మహ్మద్ జహీర్, మాజీ ఎంపీటీసీ, గుండుగొలను

వైఎస్సార్‌సీపీలో చేరికలు



గూటాలలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చిన్నం రామకోటయ్య, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామంలో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. గురువారం గూటాల గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నం రామకోటయ్య, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ గ్రామానికి చెందిన సుమారు 100 మంది పార్టీలో చేరగా అత్యధిక శాతం మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మెచ్చి పార్టీలోకి చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడితో ఎస్‌ఈబీ అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.పట్టాభిచౌదరి చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు బైనేరు వంతెన వద్ద గురువారం తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో స్కూటీపై ఓ వ్యక్తి 100 మద్యం సీసాలు తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతనిని అరెస్టు చేసి, మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, స్కూటీని సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ లాయర్ల అభివృద్ధికి కృషి

అభ్యర్థులు సునీల్ కుమార్, నాని





న్యాయవాదులతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్ కుమార్, నాని, గజమాలతో సునీల్ కుమార్, నానిలను సత్కరించిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): జూనియర్ లాయర్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లా నేస్తం పథకం ప్రవేశపెట్టి ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్ కుమార్, ఆళ్ల నానిలు తమ ప్రచారంలో భాగంగా గురువారం ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల అభివృద్ధి, సంక్షేమానికి తాను శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఆళ్ల నాని సూచనలు, సలహాల మేరకు ఏలూరు పార్లమెంటును అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని మాట్లాడుతూ తానెప్పుడు ఇక్కడికి వచ్చినా సొంత మనుషులు వద్దకు వచ్చినట్టు ఉంటుందని, తన నాన్నగారికి ఏలూరు బార్ అసోసియేషన్‌కి విడదీయరాని అనుబంధం ఉందని చెప్పారు. బార్ అసోసియేషన్‌కు సంబంధించిన ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని, ప్రభుత్వ పరంగా కూడా సహకరిస్తానని చెప్పారు. సీఎం జగన్ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అధికారం కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్న టీడీపీ అబద్ధపు హామీలతో ఆచరణ సాధ్యం కాని పథకాలతో ప్రజలను మభ్యపెట్టి లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ఏలూరు నియోజకవర్గాన్ని వైఎస్సార్ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. ఏలూరు ప్రజల తాగునీటి అవసరాల తీర్చేందుకు రూ.100 కోట్లు నిధులు కేటాయించి 110 ఎకరాల విస్తీర్ణంలో భారీ మంచినీటి చెరువు నిర్మించామని చెప్పారు. తమ్మిలేరు కాలువకు ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించి ఏలూరు ప్రజలకు తమ్మిలేరు వరదల నుంచి ఉపశమనం కలిగించామన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లేసి ఎంపీగా సునీల్‌కుమార్‌ను, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు, ఏలూరు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పితాని దుర్గాప్రసాద్, కార్యదర్శి చిన్నం సుధీర్, ఏలూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ ప్రసాద్, ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గంటా ప్రసాద్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భౌతిక దాడులు దారుణం

ఏలూరు (మెట్రో): ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికల ప్రచారాన్ని తప్పుదారి పట్టించి ఓడిపోతామనే భయంతో ప్రతిపక్ష పార్టీలపై భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గోపాలపురం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితపై నల్లజర్లలో, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌పై దాడులు చేయించి స్వేచ్ఛాయుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రచార ప్రక్రియను టీడీపీ అపహాస్యం చేస్తోందన్నారు. టీడీపీ ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక జెండాలు జతకట్టి కూటమిగా వస్తూ ఇలాంటి దాడులు చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. 13న జరిగే పోలింగ్‌లో ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీని ఆదరించి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

అరాచక శక్తులను తరిమికొట్టా | ప్రశాంత జీవనానికి నాంది పలికా

సాక్షితో వైఎస్సార్ సీపీ దెండులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి



ఇంటర్వ్యూ

ఎటు చూసినా నియోజకవర్గంలో అరాచకం కనిపిస్తూ ఉండేది. కేసులు, కొట్లాటలు, దౌర్జన్యాలతో విలవిల్లాడుతున్న పరిస్థితులు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న టీడీపీ నాయకుడి అక్రమాలతో అట్టుడుకుతున్న సమయంలో.. ఎవరొచ్చి తమకి ఈ నరకం నుంచి విముక్తి కలిగిస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్న తరుణమది. జగనన్న స్ఫూర్తితో సవాల్‌గా తీసుకొని ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నించారు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి. అరాచక శక్తులను తరిమికొట్టి.. దౌర్జన్యాలు, అక్రమాలను అణచివేసి దెండులూరులో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పారు. అంతేకాకుండా మునుపెన్నడూ చూడని రీతిలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారు. మరోసారి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న ఆయన అంతరంగం.. ఆయన మాటల్లోనే...

- దెండులూరు

ప్రశ్న: మీరు రాజకీయాల్లోకి ఎలా వచ్చారు? కుటుంబ నేపథ్యమే కారణమా?

అబ్బయ్యచౌదరి: ప్రజాసేవలో కొన్ని తరాల నుంచి తరిస్తున్న కుటుంబం మాది. మా తాతగారు, ఆ తర్వాత మా నాన్నగారు కొఠారు రామచంద్ర రావు ప్రజాజీవితానికి అంకితమై ప్రజల్లో మంచి గౌరవం పొందినవారు. దివంగత డా. వైఎస్ రాజశేఖరరెడ్డి గారి కుటుంబంతో మాకున్న సాన్నిహిత్యం, ఆయన అకాల మరణం తరువాత జగనన్న స్ఫూర్తి నన్ను రాజకీయాల వైపు మళ్లించింది. నా రాజకీయ జీవితానికి ఆయన్నే ఆదర్శంగా తీసుకొని ముందుకెళుతున్నాను.

ప్రశ్న: మీరు దెండులూరులో అడుగు పెట్టేటప్పటికీ ఇక్కడి పరిస్థితి ఎలా ఉంది?

అబ్బయ్యచౌదరి: 2018లో నేను ఇక్కడికి వచ్చేటప్పటికి ప్రజల పరిస్థితి దారుణంగా ఉంది. రెండు సార్లు ప్రజలు గెలిపించిన వ్యక్తి, ప్రజలకు సేవలు అందించాల్సింది పోయి వారిపై చెప్పలేనన్ని అరాచకాలను చేస్తూ అనేక రకాలుగా కష్టాల్లోకి నెట్టేశాడు. నిత్యం ప్రజల మీద కేసులు, కొట్లాటలు, దౌర్జన్యాలు... ఎవరొచ్చి తమకి ఈ నరకం నుంచి విముక్తి కలిగిస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్న తరుణం అది. నేను ఇక్కడికి రావడం, జగనన్న నాకు దెండులూరు బాధ్యతలు అప్పజెప్పడంతో ఒక సవాల్‌గా తీసుకొని ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నించా. అప్పటి ఎమ్మెల్యే కుట్రలను ఒక్కొక్కటిగా ఛేదించడం, ప్రజలు నాకు పెద్దత్తున మద్దతు పలకడంతో 2019లో ఇక్కడ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను.

ప్రశ్న: ఈ ఐదేళ్లలో మీరు సాధించిన విజయాలేంటి?

అబ్బయ్యచౌదరి: గత ఎమ్మెల్యే పాలనలో ఇక్కడి ప్రజలు కోల్పోయిన ఆత్మగౌరవాన్ని వారికి తిరిగి అందించాను. సంస్కారంతో ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించే సంస్కృతిని తీసుకువచ్చాను. అప్పటి బూతులు, బెదిరింపులు, దౌర్జ న్యాలు, భయాందోళనలు లేని ప్రశాంతమైన దెండులూ రును తిరిగి వారికి తిరిగి అందించాను.

ప్రశ్న: నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారు.

అబ్బయ్యచౌదరి: జగనన్న నాయకత్వంలో, గతంలో ఎన్నడూ చూడని విధంగా దెండులూరుకు రూ.3400 కోట్ల నిధులను ఇక్కడ సంక్షేమాభివృద్ధికి అందించి ప్రజల జీవన ప్రమాణాలను, గ్రామాల రూపురేఖలను సమూలంగా మార్చాను. రూ.32 కోట్లతో 80 గ్రామ సచివాలయాలు, రూ.18 కోట్లతో 81 రైతు భరోసా కేంద్రాలు, రూ.12 కోట్లతో 66 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రూ.12 కోట్లతో 71 బల్క్ మిల్క్ సెంటర్లను ఏర్పాటు చేశాం. అలాగే ప్రజారోగ్యమే ధ్యేయంగా రూ.11 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రులను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశాం. నియోజకవర్గంలో రూ.350 కోట్లతో గ్రామ గ్రామాన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, అలాగే నియోజకవర్గం గుండా వెళ్లే ప్రధాన రహదారులను కూడా నిర్మించి రవాణా వ్యవస్థను అభివృద్ధి చేశాం. 25000 మంది అక్క చెల్లెమ్మల సొంత ఇంటి కలను నెరవేరుస్తూ వారికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు అందించాం. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన జానంపేట బ్రిడ్జి, శ్రీపర్రు కాజ్‌వే పూర్తి చేశాను

ప్రశ్న: విద్యుత్ సమస్యలను పరిష్కరించారా?

అబ్బయ్యచౌదరి: రూ.100 కోట్లతో ఏలూరు రూరల్ మండలంలో అనేక అభివృద్ధి పనులు చేశాం. దీనితోపాటు ప్రజల విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రూ. 250 కోట్లతో 5 కొత్త సబ్ స్టేషన్లను నిర్మించాం. అలాగే అనేక గ్రామాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టించి, వందల కిలోమీటర్ల మేర నూతన విద్యుత్ లైన్లను వేయించాం. సమయానికి కాలువల మరమ్మతులు చేపట్టడంతో పాటు గోదావరి, కృష్ణ నదుల నుంచి రెండో పంటకు నీరు అందించి సుమారు 6 వేల ఎకరాలను సాగుబడిలోకి తెచ్చి రైతన్నలకు అండగా నిలబడ్డాం. ఇలా ఒక్కటేంటి ప్రజల జీవితా లకు సంబంధించిన ప్రతి విషయంలో నేను చాలా శ్రద్ధ తీసుకుని కృషి చేస్తున్నాను.

ప్రశ్న: ఈ ఎన్నికలలో మీ గెలుపుపై అంచనాలు ఎలా ఉన్నాయి?

అబ్బయ్యచౌదరి: దెండులూరును ప్రజల సహకారంతో అబ్బయ్యచౌదరి కోటగా మార్చాను. ఇక్కడ మా గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరు. మేము ఎంత రికార్డు మెజారిటీ సాధిస్తాం అనే విషయం పై కూడా ఖచ్చితమైన స్పష్టతతో ఉన్నాము.

ప్రశ్న: మళ్లీ మీరు ఎమ్మెల్యేగా గెలిచాక చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు ఏంటి?

అబ్బయ్యచౌదరి: దశాబ్దాల కలగా మిగిలిపోయిన బలివే బ్రిడ్జి పనులు ఇపుడు జరిపిస్తున్నాం. రూ.62 కోట్లతో పెదవేగి మండలంలో సీతమ్మ చెరువు ప్రాజెక్టును ఏర్పాటు చేస్తూ సుమారు 42 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చనున్నాము. అలాగే దెండులూరు రైతులకు సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.72 కోట్ల నిధులతో జగన్నాధపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాము. అలాగే ప్రతి గ్రామానికి సంబంధించి చేయించాల్సిన పనులు అంటే సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మన బడి నాడు, తాగు, సాగు నీరు, విద్యుత్, శ్మశానాలు, కమ్యూనిటీ హాళ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు మొదలైన వాటి అభివృద్ధికి బ్లూప్రింట్ సిద్ధం చేశాను. ఇవే కాకుండా ప్రజలు కోరే ఇతర సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తూ, దెండులూరును అభివృద్ధి పథంలో నడిపిస్తా.

ప్రశ్న నియోజకవర్గ ఓటర్లకు మీరు ఏం చెప్పదల్చుకున్నారు?

అబ్బయ్యచౌదరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన యువతరం ప్రతినిధి. రేపటి తరాల భవిష్యత్తుకు ఆయన వారధి లాగా నిలబడి దేశంలోనే, కనివినీ ఎరుగని రీతిలో సంస్కరణలను మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఒక పక్కన రూ.2.70 లక్షల కోట్ల సంక్షేమం అందించి పేదలకు అండగా నిలబడ్డారు. మరో పక్కన విద్య, వ్యవసాయం, వైద్య రంగాలతో పాటుగా అన్ని వర్గాలు ఆర్థిక అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నారు. రేపటి మన అవసరాలను నేడే గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్న దార్శనీకుడు సీఎం జగన్. రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఇవ్వగల సత్తా ఉన్న నాయకుడు ఆయనొక్కరే. జగనన్న ద్వారా వ్యక్తికి, కుటుంబానికి మంచి జరిగిందని అనిపిస్తేనే ఓటు వెయ్యండని బహిరంగ ప్రకటన చేసిన గొప్ప శ్రామికుడు ఆయన. మరో పక్కన, చెప్పే ఏ హామీ నెరవేర్చని బాబు గారు, ఏం చెప్పాలో తెలియని పీకే, ఇంకో పక్కన ఎటువంటి బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా లేని ఢిల్లీ పార్టీలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ఒక దుర్మార్గ పాలనను అంతం చేసిన స్ఫూర్తితో, రేపటి దెండులూరు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మీ అభివృద్ధి కోసం పని చేసే వైఎస్సార్ సీపీ గెలిపించాలని ప్రజలను కోరుతున్నా.

ప్రచార పర్వం



పోలవరం ఎమ్మెల్యేగా వైఎస్సార్ సీపీ అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మిని గెలిపించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఓటర్లను అభ్యర్థించారు. బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. - బుట్టాయగూడెం

సీఎం జగనన్న చేసిన మంచిని గుర్తు చేసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే నాని ఓటర్లను అభ్యర్థించారు. నగరంలోని తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. - ఏలూరు టౌన్



ఆరోగ్య సిరులు

- ఏలూరు జిల్లాలో 18 పీహెచ్‌సీల ఏర్పాటు
- భవన నిర్మాణాలకు, వసతుల కల్పనకు నిధుల మంజూరు
- వైద్యులు, వైద్య సిబ్బంది నియామకంతో మెరుగైన వైద్యసేవలు



నూజివీడులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



బీపీ చూస్తున్న సిబ్బంది



పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం వచ్చిన పేదలు

నూజివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య రంగంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయడంతో పాటు వాటికి భవన నిర్మాణాలకు, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయడమే కాకుండా వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించింది. దీంతో పట్టణాల్లోని పేదలకు వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయి. చంద్రబాబు పాలనలో రోగనిర్ధారణ పరీక్షలను ప్రైవేటు సంస్థ అయిన మెడాల్ ల్యాబ్‌కు కట్టబెట్టి ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలుచేసింది. అప్పట్లో ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగులు వెళ్తే వారి రోగ నిర్ధారణ నిమిత్తం శాంపిల్స్ సేకరించి నియోజకవర్గ కేంద్రంలో ఉండే మెడాల్ ల్యాబ్‌కు పంపించేవారు. వాటి ఫలితాలు రెండు రోజులకు వచ్చేవి. అప్పటివరకు ఆ రోగికి సరైన వైద్యం అందేది కాదు. నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్య పరీక్షలన్నీ ఉచితంగా నిర్వహిస్తున్నారు.

అందుబాటులో 63 రకాల పరీక్షలు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొత్తం 63 రకాల పరీక్షలను ఉచితంగా చేస్తారు. షుగర్, యూరిన్ ఎగ్జామిన్, లిపిడ్ ప్రొఫైల్స్, కిడ్నీ పరీక్షలు, కొలెస్ట్రాల్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర పరీక్షలను చేస్తారు. అలాగే ఈ కేంద్రాల్లో ప్రభుత్వం 172 రకాల మందులను రోగులకు ఉచితంగా అందుబాటులో ఉంచారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నారు. దీనికి గాను ప్రభుత్వ రంగంలోని ఆసుపత్రిలను బలోపేతం చేస్తూ వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 55 వేల మంది వైద్య సిబ్బందిని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నియమించారు.

జిల్లాలో 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

పేదలకు వేగంగా వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవన నిర్మాణానికి రూ.80 లక్షలను మంజూరు చేసింది. ఏలూరు నగరంలో 13, నూజివీడులో 2, జంగారెడ్డిగూడెంలో 2, చింతలపూడిలో ఒకటి చొప్పున ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో రోజుకు 70 నుంచి100 మంది వైద్యసేవలు పొందుతున్నారు.

నాణ్యమైన వైద్యం..



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇప్పటికి మూడుసార్లు చూపించుకోవడానికి రాగా వైద్యులు చక్కగా చెకప్ చేసి మందులు ఇస్తున్నారు. గర్భం దాల్చడంతో దానికి సంబంధించిన మందులు కూడా ఇక్కడే వాడుతున్నాను.

– బి.హిమబిందు, గాంధీనగర్, నూజివీడు

వైద్యఖర్చులు తగ్గాయి



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వల్ల పేదలకు వైద్య ఖర్చులు తగ్గాయి. పరీక్షలు ఉచితంగా చేయడంతో ఆర్థికంగా భారం పడటం లేదు. అదే ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే పరీక్షలతో కలిపి కనీసం వెయ్యి రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

– పామర్తి వెంకట్రావు, నూజివీడు

బువ్వనపల్లి.. ప్రగతి పరిఢవిల్లి

- నాలుగున్నరేళ్లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పరుగులు
- నాడు కూలే పంచాయతీ.. నేడు రెండు ఆధునిక భవనాలు
- జగనన్న కాలనీతో పాటు ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు
- అవినీతి, పక్షపాతం లేని రూ.కోట్ల సంక్షేమం
- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు
- నాడు గోతుల రహదారులు.. నేడు మారిన రోడ్ల స్వరూపం
- నాడు అధ్వానంగా.. నేడు సుందరీకరణతో మరుభూమి



నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం




రక్షిత మంచినీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్



బువ్వనపల్లిలో జగనన్న కాలనీలో నిర్మాణాలు

నిడమర్రు: ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామం చరిత్రలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా రూ.16.1 కోట్లతో అభివృద్ధి, రూ.25.8 కోట్ల సంక్షేమం ఈ ఐదేళ్లలో మాత్రమే జరిగిందంటూ గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత చంద్రబాబు పరిపాలనతో గ్రామ పంచాయతీ భవనానికి కనీసం మరమ్మతులు కూడా నోచుకోని పరిస్థితి. నేడు అధునిక వసతులతో కూడిన రూ.90 లక్షలతో రెండు గ్రామ సచివాలయ భవనాలు, గతంలో పంచాయతీ సిబ్బంది ఆరుగురు మాత్రమే. నేడు 23 మంది ప్రజలకు అందుబాటులో ఉన్నారు. రైతు భరోసా కేంద్ర, విలేజ్ క్లినిక్‌లకు సొంతభవనాలు ఉన్నాయి. 70 ఏళ్ల తర్వాత రూ.1.68 కోట్లతో ధర్మచెరువు



గ్రామ సచివాలయం	లబ్ధిదారులు	ప్రత్యక్ష లబ్ధి	పరోక్ష లబ్ధి
సచివాలయం–1	5,139	రూ.13.9 కోట్లు	రూ.8.0 కోట్లు
సచివాలయం–2	4,522	రూ.11.9 కోట్లు	రూ.8.1 కోట్లు
మొత్తం	9,661	రూ.25.8 కోట్లు	రూ.16.1 కోట్లు

పూడికతీత పనులు, కొత్త పైప్‌లైన్ నిర్మాణం, మైక్రో ఫిల్టర్ ఏర్పాటు జరిగింది. నాడు గ్రామం నుంచి ఎటు వెళ్లాలన్నా అధ్వానంగా ఉన్న రహదారులు నేడు రూ.6.2 కోట్లతో నిర్మించిన రహదారులు రాచమార్గాలను తలపిస్తున్నాయి. జగనన్న కాలనీ భూసేకరణ కోసం రూ.3.85 కోట్లు ఖర్చు చేసి 117 మందికి ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు మౌలిక వసతుల కోసం మరో రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు కాలనీ వాసులు చెపుతున్నారు. టీడీపీ హయాంలో పిచ్చిమొక్కలతో నిండిన గ్రామ శ్మశానవాటిక రూ.35 లక్షలతో నేడు పార్కును తలపిస్తోంది. గతంలో 50 మంది విద్యార్థులతో ఉన్న ప్రభుత్వ బడి నాడు–నేడు పథకం నిధులు రూ.55 లక్షలతో, ఇంగ్లీష్ మీడియం బోధనతో నేడు 8వ తరగతి వరకు వర్గోన్నతి చెంది 235 మంది విద్యార్థులతో కళకళలాడుతుంది. ఇక్కడే పుట్టి పెరిగి విదేశాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండుగకు వచ్చినపుడు మాఊరు మారిందంటూ సంతోషం వ్యక్తం చేశారు. గతంలో లోకేష్, ఇటీవల పవన్ కళ్యాణ్ గణపవరం ప్రచారంలో కనీస అవగాహన లేకుండా బువ్వనపల్లిలో అభివృద్ధి లేదంటూ ఎమ్మెల్యే వాసుబాబుపై విమర్శించడాన్ని గ్రామస్తులంతా ఏకతాటిపై తప్పు పడుతున్నారు. ముఖ్యమంత్రిగా మరోసారి జగన్ వస్తే మా గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందంటూ వారంతా మద్దతు తెలుపుతున్నారు.



నాడు గోతులతో నిండిన బువ్వనపల్లి- క్రొవ్విడి ఆర్‌అండ్‌బీ రోడ్డు



నేడు రూ.2.3 కోట్లతో నిర్మించిన బువ్వనపల్లి - క్రొవ్విడి రోడ్డు



నాడు 5వ తరగతి వరకు ఉన్న ప్రభుత్వ బడి



నేడు 8వ తరగతి వరకు వర్గోన్నతి పొందిన అదే బడి



నాడు అధ్వానంగా ఉన్న గ్రామ శ్మశానం



నేడు రూ.30 లక్షల అభివృద్ధి పనులతో పార్కును తలపిస్తూ..



నాడు మడుగులా ఉన్న బువ్వనపల్లి- అడవికొలను మార్గం



నేడు రూ.3.2 కోట్లతో నిర్మించిన బువ్వనపల్లి - అడవికొలను సీసీ రోడ్డు

Published and Printed by V.Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey no 108/6,Prathipadu Village, Pentapadu Mandal, (West Godavari) and Printed at Jagati Publications Limited Survey no 108/6, Prathipadu Village, Pentapadu Mandal, (West Godavari), Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act), Phone No. 08818 280033. Fax No. 08818 281789 RNI Regn No. APTEL/2008/23807.